03-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇది అనంతమైన విశాలమైన స్టేజ్, ఇందులో ఆత్మలైన మీరు పాత్రను అభినయించడానికి బంధించబడి ఉన్నారు, ఇందులో ప్రతి ఒక్కరిదీ నిశ్చితమైన పాత్ర"

ప్రశ్న:- కర్మాతీత అవస్థను ప్రాప్తి చేసుకునేందుకు పురుషార్థము ఏమిటి?

జవాబు:- కర్మాతీతముగా అవ్వాలంటే పూర్తి-పూర్తిగా సరెండర్ అవ్వవలసి ఉంటుంది. తమదంటూ ఏదీ ఉండకూడదు. అన్నింటినీ మర్చిపోయినప్పుడే కర్మాతీతముగా అవ్వగలుగుతారు. ఎవరికైతే ధనము, సంపద, పిల్లలు... మొదలైనవి గుర్తుకువస్తాయో వారు కర్మాతీతముగా అవ్వలేరు, అందుకే బాబా అంటారు, నేను పేదల పాలిటి పెన్నిధిని. పేద పిల్లలు త్వరగా సరెండర్ అవుతారు. వారు సహజముగానే అన్నింటినీ మరచి ఒక్క తండ్రి స్మృతిలో ఉండగలుగుతారు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని తమ ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తున్నారు, పిల్లల బుద్ధిలో ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి అని తప్పకుండా ఉంది. ఇది భక్తుల బుద్ధిలో ఉండదు. ఈ 84 జన్మల చక్రము ఇప్పుడు పూర్తయిందని మీకు తెలుసు. ఇది చాలా పెద్ద అనంతమైన నాటక రంగస్థలము అనగా స్టేజ్. ఇది విశాలమైన స్టేజ్. ఈ పాత రంగస్థలాన్ని వదిలి ఇక ఇంటికి వెళ్ళాలి. అపవిత్రమైన ఆత్మలైతే వెళ్ళలేవు. పవిత్రముగా తప్పకుండా అవ్వాలి. ఇప్పుడు ఇక ఇది ఈ ఆట అంతిమము. అపారమైన దుఃఖాలు ఇప్పుడు వెనుక ఉన్నాయి. ఈ సమయములో ఇదంతా మాయ ఆర్భాటము, దీనినే మనుష్యులు స్వర్గముగా భావిస్తారు. ఎన్ని మహళ్ళు, మోటార్లు మొదలైనవి ఉన్నాయి, దీనినంతా మాయ పోటి అని అంటారు. నరకముకు స్వర్గముతో పోటీ ఉంది. ఈ సుఖాలు అల్పకాలికమైనవి. ఇవి డ్రామానుసారంగా మాయ తీసుకొచ్చే లోభము. ఎంతమంది మనుష్యులున్నారు. మొదట కేవలం ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మమే ఉండేది. ఇప్పుడైతే ఈ రంగస్థలమంతా నిండిపోయింది. ఇప్పుడు ఈ చక్రము పూర్తవుతుంది, అందరూ తమోప్రధానముగా ఉన్నారు, సృష్టి కూడా తమోప్రధానముగా ఉంది, మళ్ళీ ఇది సతోప్రధానముగా అవ్వాలి. మొత్తం సృష్టి అంతా కొత్తగా కావాలి కదా. కొత్తది నుండి పాతగా, పాతది నుండి కొత్తగా, ఇలా లెక్కలేనన్ని సార్లు నడుస్తూ వచ్చింది. ఇది అనాది ఆట. ఇది ఎప్పుడు ప్రారంభమయ్యింది అన్నది చెప్పలేరు. ఇది అనాదిగా నడుస్తూనే ఉంటుంది. ఇది కూడా మీకే తెలుసు, ఇంకెవ్వరికీ తెలియదు. మీకు కూడా ఈ జ్ఞానము లభించక ముందు ఏమీ తెలియదు. ఇది దేవతలకు కూడా తెలియదు, కేవలం పురుషోత్తమ సంగమయుగీ బ్రాహ్మణులైన మీకు మాత్రమే తెలుసు, మళ్ళీ ఈ జ్ఞానము కనుమరుగైపోతుంది. తండ్రి సుఖధామానికి యజమానులుగా తయారుచేసారు, ఇంకేమి కావాలి. తండ్రి నుండి ఏదైతే పొందాలో దానిని పొందేశారు, ఇంక పొందడానికి ఏమీ ఉండదు. కావున తండ్రి అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, మీరే అందరికన్నా ఎక్కువ పతితులుగా అయ్యారు. మొట్టమొదట పాత్రను అభినయించడానికి మీరే వచ్చారు. అలాగే మీరే మొట్టమొదట వెళ్ళవలసి ఉంటుంది. ఇది చక్రము కదా. మొట్టమొదట మీరే మాలలో కూర్చబడతారు. ఇది రుద్రమాల కదా. ఈ దారములో మొత్తం ప్రపంచములోని మనుష్యులందరూ కూర్చబడి ఉన్నారు. ఈ దారము నుండి బయటకు వచ్చి పరంధామములోకి వెళ్ళిపోతారు, మళ్ళీ ఇదే విధముగా ఈ దారములో కూర్చబడతారు. ఇది చాలా పెద్ద మాల. శివబాబాకు ఎంతమంది పిల్లలున్నారు. మొట్టమొదట దేవతలైన మీరు వస్తారు. ఇది అనంతమైన మాల, ఇందులో అందరూ పూసల వలె కూర్చబడి ఉన్నారు. రుద్రమాల మరియు విష్ణుమాల గానం చేయబడుతుంది. ప్రజాపిత బ్రహ్మా యొక్క మాల లేదు. బ్రహ్మాకుమార, కుమారీలైన మీ మాల ఉండదు, ఎందుకంటే మీరు పైకి ఎక్కుతూ, పడిపోతూ, ఓడిపోతూ ఉంటారు. ఘడియ-ఘడియ మాయ పడేస్తూ ఉంటుంది. అందుకే బ్రాహ్మణులు మాల తయారవ్వదు, ఎప్పుడైతే పూర్తిగా పాస్ అవుతారో అప్పుడు విష్ణుమాల తయారవుతుంది. ఆ మాటకొస్తే ప్రజాపిత బ్రహ్మా యొక్క వంశవృక్షము కూడా ఉంది. ఎప్పుడైతే పాస్ అవుతారో అప్పుడు బ్రహ్మా యొక్క మాల కూడా ఉంది అని అంటారు. వంశవృక్షము తయారై ఉంది. ఈ సమయములో మాల తయారవ్వదు ఎందుకంటే ఈ రోజు పవిత్రముగా అవుతారు, రేపు మళ్ళీ మాయ దెబ్బ ఆత్మలోని విశేషతలను, శరీరములోని శక్తిని సమాప్తము చేసేస్తుంది. చేసుకున్న సంపాదన అంతా అంతమైపోతుంది. ముక్కలైపోతారు. ఎక్కడి నుండి పడతారో ఆలోచించండి. తండ్రి అయితే విశ్వాధిపతులుగా తయారుచేస్తారు. వారి శ్రీమతముపై నడవడం ద్వారా మీరు ఉన్నత పదవిని పొందగలుగుతారు. ఓడిపోయారంటే అంతమైపోతారు. కామ వికారము మహాశత్రువు, దానితో ఓడిపోకూడదు. మిగిలిన వికారాలన్నీ చిన్న పిల్లల వంటివి. పెద్ద శత్రువు కామ వికారమే, దానిపైనే విజయము పొందాలి. కామముపై విజయాన్ని పొందడము ద్వారా మీరు జగత్ జీతులుగా అవుతారు. ఈ పంచ వికారాలు

అర్ధకల్పపు శత్రువులు, అవి కూడా వదలవు. క్రోధం చేయవలసి వస్తుంది అని అందరూ అరుస్తూ ఉంటారు, కానీ అసలు దాని అవసరం ఏముంది? ప్రేమతో కూడా పని జరగగలదు. దొంగకు కూడా ప్రేమగా అర్థం చేయించినట్లయితే అతను వెంటనే నిజం చెప్పేస్తాడు. తండ్రి అంటారు, నేను ప్రేమ సాగరుడిని కదా, కావున పిల్లలు కూడా ప్రేమగానే పని చేయాలి. మీరు ఏ పొజిషన్ లో ఉన్నా సరే, ప్రేమగా పని చేయించాలి. బాబా వద్దకు మిలిట్రీవారు కూడా వస్తారు. వారికి కూడా బాబా అర్థం చేయిస్తారు, మీరు స్వర్గములోకి వెళ్ళాలనుకుంటే కేవలం శివబాబాను స్మృతి చేయండి. మీరు యుద్ధ మైదానములో మరణించినట్లయితే స్వర్గములోకి వెళ్తారు అని వారికి చెప్పడం జరుగుతుంది. వాస్తవానికి యుద్ధ మైదానము ఇదే. వారైతే యుద్ధం చేస్తూ, చేస్తూ మరణిస్తారు కావున మళ్ళీ అక్కడికే వెళ్ళి జన్మ తీసుకుంటారు ఎందుకంటే ఆ సంస్కారాలను తీసుకువెళ్తారు. స్వర్గములోకైతే వెళ్ళలేరు. కావున బాబా వారికి అర్థం చేయించేవారు, శివబాబాను స్మృతి చేయడం ద్వారా మీరు స్వర్గములోకి వెళ్ళగలుగుతారు ఎందుకంటే స్వర్గ స్థాపన జరుగుతోంది. శివబాబా స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. ఈ జ్ఞానము కొద్దిగా లభించినా సరే ఈ అవినాశీ జ్ఞానము వినాశనం అవ్వదు.

పిల్లలైన మీరు ఈ మేళాలు మొదలైనవి చేస్తారు, అప్పుడు ఎంతమంది ప్రజలు తయారవుతారు. మీరు ఆత్మిక సైన్యము కద. ఇందులో కమాండర్, మేజర్ మొదలైనవారు కొద్దిమందే ఉంటారు, ప్రజలైతే ఎంతోమంది తయారవుతారు. ఎవరైతే బాగా అర్థం చేయిస్తారో వారు ఎంతోకొంత మంచి పదవిని పొందుతారు. వారిలో కూడా ఫస్ట్, సెకండ్, థర్డ్ గ్రేడ్లు ఉంటాయి. మీరు శిక్షణను ఇస్తూ ఉంటారు. కొందరైతే పూర్తిగా మీ సమానముగా తయారైపోతారు. కొందరు అందరికన్నా పైకి కూడా వెళ్ళగలుగుతారు. ఒకరికంటే ఒకరు పైకి వెళ్ళిపోవడాన్ని చూడడం జరుగుతుంది. కొత్త-కొత్తవారు పాతవారికన్నా చురుకుగా ముందుకు వెళ్ళిపోతారు. తండ్రితో పూర్తి యోగము జోడింపబడినట్లయితే చాలా ఉన్నత స్థాయికి వెళ్ళిపోతారు. మొత్తం ఆధారమంతా యోగముపైనే ఉంది. జ్ఞానమైతే చాలా సహజమైనది, మీరు ఫీల్ అవుతూ ఉంటారు. తండ్రి స్మృతిలో విఘ్నాలు కలుగుతాయి. తండ్రి అంటారు, భోజనం చేసినా కానీ స్మృతిలోనే చేయండి. కానీ కొందరు 2 నిమిషాలు, కొందరు 5 నిమిషాలు స్మృతిలో ఉంటారు. మొత్తం సమయమంతా స్మృతిలో ఉండడం చాలా కష్టము. మాయ ఎక్కడో అక్కడ ఎత్తుకుపోయి మరపింపజేస్తుంది. ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ స్మృతి చేయకపోతే అప్పుడే కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. ఒకవేళ తమదంటూ ఏది ఉన్నా అది తప్పకుండా గుర్తుకు వస్తుంది. ఏమీ గుర్తుకు రాకూడదు, ఈ బాబాయే ఉదాహరణ, వీరికి ఏమి గుర్తుకు వస్తుంది? పిల్లా-పాపలు, ధన-సంపదలు ఏమైనా ఉన్నాయా? కేవలం పిల్లలైన మీరే గుర్తుకు వస్తారు. మీరు తండ్రికి తప్పకుండా గుర్తు వస్తారు, ఎందుకంటే తండ్రి వచ్చిందే కళ్యాణము చేసేందుకు. వారు అందరినీ గుర్తు చేస్తారు, అయినా కానీ బుద్ధి పుష్పాల వైపుకే వెళ్తుంది. పుష్పాలు అనేక రకాలవి ఉంటాయి, కొన్ని సుగంధం లేని పుష్పాలు కూడా ఉంటాయి. ఇది ఒక తోట కదా. తండ్రిని తోట యజమాని, తోట మాలి అని కూడా అంటారు. మనుష్యులు క్రోధములోకి వచ్చి ఎంతగా కొట్లాడుతూ-గొడవపడుతూ ఉంటారో మీకు తెలుసు. ఎంతో దేహాభిమానం ఉంది. తండ్రి అర్థం చేయిస్తారు, ఎప్పుడైనా ఎవరైనా క్రోధం చేసినట్లయితే శాంతిగా ఉండాలి. క్రోధము భూతము కదా. భూతము ముందు శాంతిగా జవాబివ్వాలి.

సర్వ శాస్త్ర శిరోమణి అయిన శ్రీమత్ భగవద్గీత ఈశ్వరీయ మతానికి చెందినది. ఈశ్వరీయ మతము, ఆసురీ మతము మరియు దైవీ మతములను ఒక్క ఈశ్వరుడే వచ్చి తెలియజేస్తారు. వారు రాజయోగము యొక్క జ్ఞానాన్ని ఇస్తారు. తర్వాత ఈ జ్ఞానము కనుమరుగైపోతుంది. రాజులకే రాజులుగా అయిన తర్వాత ఇక జ్ఞానాన్ని ఏమి చేసుకుంటారు? 21 జన్మలు ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. ఇది ఈ పురుషార్థము యొక్క ఫలమేనని అక్కడ తెలియదు. అనేక సార్లు మీరు సత్యయుగములోకి వెళ్ళారు. ఈ చక్రము తిరుగుతూ ఉంటుంది. సత్య, త్రేతాయుగాలు జ్ఞానము యొక్క ఫలము. అక్కడ జ్ఞానము లభిస్తుందని కాదు. తండ్రి వచ్చి ఇక్కడ భక్తి ఫలముగా జ్ఞానాన్ని ఇస్తారు. మీరు ఎక్కువ భక్తిని చేసారు అని తండ్రి తెలియజేశారు. ఇప్పుడు ఒక్క తండ్రిని స్మృతి చేసినట్లయితే తమోప్రధానుల నుండి సతోప్రధానులుగా అయిపోతారు. ఇందులోనే శ్రమ ఉంది. రచన యొక్క ఆదిమధ్యాంతాలను స్మృతి చేసినట్లయితే చక్రవర్తీ రాజులుగా అయిపోతారు. భగవంతుడు తమ పిల్లలను భగవాన్, భగవతీలుగా తయారుచేస్తారు కదా. కానీ దేహధారులను భగవాన్, భగవతి అని అనడం తప్పు. బ్రహ్మకు, విష్ణువుకు మరియు శివునికి ఎంత సంబంధం ఉంది. ఈ బ్రహ్మయే మళ్ళీ విష్ణువుగా అవ్వనున్నారు మరియు ఇతనిలో శివుడు ప్రవేశించారు. సూక్ష్మవతనములోనివారిని ఫరిశ్తా అని అంటారు. మీరు ఫరిశ్తాగా అవ్వాలి. సాక్షాత్కారమవుతుంది, అంతేకానీ ఇంకేమీ లేదు. సైలెన్స్, మూవీ మరియు ఇది టాకీ. ఇది విస్తారము. సారములో మన్మనాభవ, నన్నొక్కరినే స్మృతి చేయండి మరియు సృష్టి చక్రాన్ని స్మృతి చేయండి అని చెప్తారు. ఇక్కడ కూర్చున్నా సరే శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేయండి. ఈ పాత

దుఃఖధామాన్ని మర్చిపోండి. ఇది బుద్ధి ద్వారా చేసే అనంతమైన సన్యాసము. వారిది హద్దులోని సన్యాసము. ఆ నివృత్తి మార్గమువారు ప్రవృత్తి మార్గపు జ్ఞానాన్ని ఇవ్వలేరు. రాజా, రాణులుగా అవ్వడం ప్రవృత్తి మార్గము. అక్కడ అంతా సుఖమే ఉంటుంది. ఆ సన్యాసులైతే సుఖాన్ని అసలు అంగీకరించనే అంగీకరించరు. సన్యాసులు కూడా కోట్ల లెక్కలో ఉన్నారు. వారి పాలన మరియు సంపాదన గృహస్థుల ద్వారా జరుగుతుంది. ఒకటేమో మీరు అంతా దానపుణ్యాలలో పెట్టారు, మళ్ళీ పాపపు వ్యాపారాలను చేసారు కావున పాపాత్ములుగా అయ్యారు. పిల్లలైన మీరైతే ఇప్పుడు అవినాశీ జ్ఞాన రత్నాలను ఇచ్చిపుచ్చుకుంటూ ఉంటారు. వారు ధర్మశాలలు మొదలైనవాటిని కట్టిస్తే మరుసటి జన్మలో మంచి ఫలము లభిస్తుంది. ఇక్కడ వీరు అనంతమైన తండ్రి. ఇది డైరెక్ట్, అది ఇన్ డైరెక్ట్. ఈశ్వరార్పణమయము చేస్తారు. కానీ ఆకలి అయితే ఇరువురికీ లేదు. శివబాబా అయితే దాత, వారికి ఏమైనా ఆకలి ఉంటుందా. శ్రీకృష్ణుడు దాత కాదు. తండ్రి అయితే అందరికీ ఇచ్చేవారే కానీ తీసుకునేవారు కాదు. ఒకటి ఇస్తారు, పది పొందుతారు. పేదలు రెండు రూపాయలు ఇస్తే పదమాలు లభిస్తాయి (సుదాముని ఉదాహరణ). భారత్ బంగారు పిచ్చుకగా ఉండేది కదా. తండ్రి ఎంత షావుకారులుగా తయారుచేసారు. సోమనాథ మందిరములో ఎంత అపారమైన ధనము ఉండేది. దానిని ఎంతగా దోచుకుని వెళ్ళిపోయారు. పెద్ద-పెద్ద వజ్ర-వైఢూర్యాలు ఉండేవి. ఇప్పుడైతే కనిపించను కూడా కనిపించడం లేదు, అన్నింటినీ కట్ చేసేసారు. మళ్ళీ చరిత్ర రిపీట్ అవుతుంది. అక్కడ గనులన్నీ మీ కొరకు నిండిపోతాయి. అక్కడ వజ్ర-వైఢూర్యాలు రాళ్ళ వలె ఉంటాయి. తండ్రి అవినాశీ జ్ఞాన రత్నాలను ఇస్తారు, వాటి ద్వారా మీరు అపారమైన షావుకారులుగా అవుతారు. కావున మధురాతి-మధురమైన పిల్లలకు ఎంతటి సంతోషము ఉండాలి. ఎంతగా చదువుతూ ఉంటారో అంతగా సంతోషపు పాదరసము పైకి ఎక్కుతూ ఉంటుంది. పెద్ద పరీక్షను పాస్ అయితే బుద్ధిలో - దీనిని పాస్ చేసి మళ్ళీ మేము ఈ విధంగా అవుతాము, ఇది చేస్తాము అని ఉంటుంది కదా. అలాగే, ఈ దేవతలుగా అవుతాము అని మీకు కూడా తెలుసు. ఇవి జడచిత్రాలు. మనము అక్కడ చైతన్యముగా అవుతాము. మీరు ఈ చిత్రాలనేపైతే తయారుచేశారో ఇవి ఎక్కడి నుండి వచ్చాయి? దివ్యదృష్టి ద్వారా మీరు చూసి వచ్చారు. చిత్రాలు చాలా అద్భుతమైనవి. వీటిని బ్రహ్మ తయారుచేశారు అని కొందరు భావిస్తారు. ఒకవేళ ఇతను ఎవరి నుండైనా నేర్చుకొని ఉన్నట్లయితే కేవలం ఒక్కరు మాత్రమే నేర్చుకొని ఉండరు కదా, ఇతరులు కూడా నేర్చుకొని ఉంటారు కదా. వీరు అంటారు, నేను ఏమీ నేర్చుకోలేదు, వీటిని తండ్రే దివ్యదృష్టి ద్వారా తయారుచేయించారు. ఈ చిత్రాలన్నీ శ్రీమతము ద్వారా తయారుచేయబడ్డాయి. ఇవి మనుష్య మతానికి సంబంధించినవి కావు. ఇవన్నీ అంతమైపోతాయి. వీటి నామ-రూపాలు కూడా ఉండవు. ఇది మొత్తం సృష్టి యొక్క అంతిమ సమయము. భక్తి సామాగ్రి ఎంతగా ఉంది. ఇవి ఇక ఉండవు. కొత్త ప్రపంచములో అన్నీ కొత్తగా ఉంటాయి. మీరు అనేక సార్లు స్వర్గాధిపతులుగా అయ్యారు, మళ్ళీ మాయ ఓడించేసింది. మాయ అని వికారాలనే అంటారు కానీ ధనాన్ని కాదు. పిల్లలైన మీరు రావణుడి సంకెళ్ళలో అర్ధకల్పం నుండి చిక్కుకొని ఉన్నారు. రావణుడు అందరికన్నా పాత శత్రువు. అర్ధకల్పం అతని రాజ్యం నడుస్తుంది. లక్షల సంవత్సరాలు అని అనేయడంతో ఇక సగం, సగం యొక్క లెక్క కుదరదు. ఎంత తేడా ఉంది. మొత్తం కల్పం ఆయువు అంతా కలిపి 5000 సంవత్సరాలేనని మీకు తండ్రి తెలియజేశారు. 84 లక్షల యోనులు ఏమీ లేవు, ఇవన్నీ ప్రగల్భాలే. సూర్యవంశీయులు, చంద్రవంశీయులు అయిన దేవీ-దేవతలు ఇన్ని లక్షల సంవత్సరాలు రాజ్యం చేసేవారా. బుద్ధి పని చేయడం లేదు. ఇప్పుడు మేము స్వయాన్ని తప్పుగా భావించినట్లయితే ఇక అనుచరులందరూ మమ్మల్ని వదిలేస్తారు, విప్లవం సృష్టించబడుతుంది అని సన్యాసులు భావిస్తారు. అందుకే ఇప్పుడు వారు మీ మతముపై నడిచి వారి రాజ్యాన్ని వదలరు. చివరిలో కొంత అర్థం చేసుకుంటారు, ఇప్పుడు కాదు. అలాగే షావుకారులు కూడా జ్ఞానాన్ని తీసుకోరు. తండ్రి అంటారు, నేను పేదల పాలిటి పెన్నిధిని. షావుకారులు ఎప్పుడూ సరెండర్ అయి కర్మాతీత అవస్థను పొందలేరు. తండ్రి అయితే చాలా శక్తివంతమైన వ్యాపారి. వారు పేదవారిదే తీసుకుంటారు. షావుకారులది తీసుకున్నట్లయితే మళ్ళీ అంతగా ఇవ్వవలసి ఉంటుంది. షావుకారులు కష్టం మీద లేస్తారు ఎందుకంటే ఇందులో అన్నీ మర్చిపోవలసి ఉంటుంది. తమ వద్ద ఏమీ ఉండకూడదు, అప్పుడే కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. షావుకారులైతే మర్చిపోలేకపోతారు, ఎవరైతే కల్పపూర్వము వారసత్వాన్ని తీసుకున్నారో వారే తీసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ విధంగా తండ్రి ప్రేమ సాగరులో, అలా మాస్టర్ ప్రేమ సాగరులుగా అయి ప్రేమతో పని చేయించాలి. క్రోధం

చేయకూడదు. ఎవరైనా క్రోధం చేస్తే మీరు శాంతిగా ఉండాలి.

2. బుద్ధి ద్వారా ఈ పాత దుఃఖమయమైన ప్రపంచాన్ని మరచి అనంతమైన సన్యాసిగా అవ్వాలి. శాంతిధామాన్ని మరియు సుఖధామాన్ని స్మృతి చేయాలి, అవినాశీ జ్ఞాన రత్నాలను ఇచ్చి పుచ్చుకోవాలి.

వరదానము:- వికారాల రూపీ విష సర్పాలను మెడలోని మాలగా తయారుచేసుకునే శంకర సమాన తపస్వీమూర్త భవ
ఈ పంచ వికారాలు ఏవైతే మనుష్యుల కొరకు విష సర్పాలుగా ఉన్నాయో, ఈ సర్పాలు యోగీ మరియు ప్రయోగీ ఆత్మలైన మీ మెడలోని మాలలుగా అవుతాయి. బ్రాహ్మణులైన మీ యొక్క మరియు బ్రహ్మాబాబా యొక్క అశరీరి తపస్వీ శంకర స్వరూపము యొక్క ఈ స్మృతిచిహ్నము నేటికీ పూజించబడుతుంది. రెండవది, ఈ సర్పాలు సంతోషములో నాట్యం చేసే స్టేజ్ లా అవుతాయి - ఇక్కడ స్థితినే స్టేజ్ రూపములో చూపిస్తారు. ఎప్పుడైతే వికారాలపై ఇటువంటి విజయము ఏర్పడుతుందో అప్పుడు తపస్వీమూర్తులు, ప్రయోగీ ఆత్మలు అని పిలవబడతారు.

స్లోగన్:- ఎవరి స్వభావమైతే మధురముగా, శాంతచిత్తముగా ఉంటుందో, వారిపై క్రోధము యొక్క భూతము దాడి చేయలేదు.